INDIA NEWS COMMUNICATIONS

| PUBLICATION | EDITION | DATE |
| --- | --- | --- |
| Namaste Telangana | Hyderabad | 16/04/2017 |

# స్టీల్ ధరలు మరింత పైకి

## కామధేను గ్రూపు డైరెక్టర్ సునీల్ అగర్వాల్

**హైదరాబాద్, ఏప్రిల్ 15:** స్టీల్ ధరలు మరింత పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిర్వహణ ఖర్చులతోపాటు ముడి సరుకుల ధరలు అమాంతం పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టీల్ మరింత ప్రియమయ్యే అవకాశం ఉందని కామధేను గ్రూపు డైరెక్టర్ సునీల్ అగర్వాల్ తెలిపారు. ఎంతమేర పెరుగనున్నదనే దానిపై ఆయన స్పష్టత నివ్వలేదు. ప్రస్తుత సంవత్సరంలో స్టీల్ రంగం నిలకడైన వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉందని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన అందరికి ఇండ్ల పథకంతోపాటు మౌలిక సదుపాయాలకోసం స్టీల్ వాడకం విరివిగా పెరుగనున్నప్పటికీ సింగిల్ డిజిట్‌కే పరిమితం కానున్నదని ఆయన అంచనావేస్తున్నారు. నూతన టెక్నాలజీతో కంపెనీ రూపొందించిన 'కామధేను నెక్ట్స్' స్టీల్‌ను ఆయన శనివారం దక్షిణాది మార్కెట్లోకి విడుదల చేశారు. భావితరాలను దృష్టిలో పెట్టుకొని ఇంటర్‌లాక్ సిస్టమ్‌తో రూపొందించిన ఈ స్టీల్ ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్న సాధారణ స్టీల్ కంటే రెండున్నర రెట్లు మెరుగైన పనితీరు కనబరుచనున్నదన్నారు. ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్న స్టీల్‌తో పోలిస్తే కాస్త అధిక ధరకు లభించనున్నదన్నారు. టన్ను స్టీల్ ధరను రూ.45 వేలుగా నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.




ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయిన తర్వాత స్టీల్‌కు డిమాండ్ పెరిగిందని, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు పడకల ఇళ్లు, నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించడంతో భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. 2015-16లో రూ.8 వేల కోట్ల స్థాయిలో నమోదైన గ్రూపు టర్నోవర్ గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను 50 శాతం వృద్ధితో రూ.12 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందన్నారు. దీంట్లో 90 శాతానికి పైగా స్టీల్ విభాగం నుంచి సమకూరుతుందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సొంతంగా, ఫ్రాంచైజ్ పద్ధతిన ఏర్పాటు చేసిన 60 ప్లాంట్ల ద్వారా ప్రతియేటా 45 లక్షల టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్నది. సమీప భవిష్యత్తులో కెపాసిటీని పెంచుకునే అవకాశాలు లేవని ఆయన స్పష్టంచేశారు.